గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ ఏరియాలోని తెలంగాణ నగర్‌లోని మురుగు కాలువలో పడి మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు గురువారం తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 60 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని ప్రస్తుతం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ దవాఖాన మార్చురీ కి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే మంచిర్యాల ఎస్‌హెచ్‌వో నంబర్ 8712656534కి ఫోన్ చేసి తెలియజేయాలని సీఐ సూచించారు.

గుడుంబా స్థావరంపై దాడి

భీమారం, ఫిబ్రవరి 13 : భీమారంలో గుడుంబా స్థావరంపై పోలీసులతో పాటు ఎక్సైజ్ అధికారులు ముకుమ్మడిగా దాడి చేశారు. ఎస్ఐ కే శ్వేత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమారం గ్రామ శివారు ప్రాంతంలో గుడుంబా తయారీ చేస్తున్నట్లు సమాచారం అందగా ఎక్సైజ్ అధికారులతో కలిసి స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. 70 లీటర్ల బెల్లం పానకం, గుడుంబా తయారీకి సంబంధించిన ముడి సరుకును పట్టుకున్నట్లు వారు తెలిపారు. స్థావరంలో దొరికిన ప్లాస్టిక్ డ్రమ్ములను దగ్ధం చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సతీశ్ రెడ్డి, అశోక్, నిహాల్, రాజ్‌కుమార్, ఎక్సైజ్ కానిస్టేబుల్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

దాడి కేసులో ఒకరి రిమాండ్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13 : మండలంలోని తాళ్లగురిజాల గ్రామానికి చెందిన గొడిసెల శివకుమార్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. గురువారం తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. బట్వాన్‌పల్లికి చెందిన రత్నం సోము, జాడి సాగర్, శివకుమార్ స్నేహితులు. వీరి మధ్య తగాదాలున్నాయి. ఈ నెల 6న రాత్రి శివకుమార్ తాళ్లగురిజాల పెట్రోల్ బంక్ దుకాణం ముందు సిగరెట్ తాగుతుండగా సోము, సాగర్ ఒక్కసారిగా అతడిపై కర్రలతో దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. గురువారం సోమును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, సాగర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఎన్నికలపై సమావేశం

కాసిపేట, ఫిబ్రవరి 13 : స్థానిక సంస్థల ఎన్నికలపై మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సఫ్దర్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
GOLD FINANCE
★ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

గూడెంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

దండేపల్లి, ఫిబ్రవరి13: దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో 8 రోజుల నుంచి కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భజన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు రఘుస్వామి, సంపత్‌స్వామి, వేనారాయణశర్మ ఉన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు తరలింపు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 13: లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీరాంపూర్ సీసీసీ, గోల్డెన్ జూబ్లీ, సఖీ క్లబ్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల కోసం రోగులను కరీంనగర్ రేకుర్తి కంటి దవాఖానకు తరలించారు. ఇటీవల సీసీసీ, శ్రీరాంపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి, కంటి ఆపరేషన్ అవసరమయ్యే వారిని గుర్తించారు. ఈ సందర్భంగా గురువారం నస్పూర్ మల్లారెడ్డి ఫంక్షన్ హాలులో దాదాపు 100మంది రోగులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 36 మంది రోగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి రేకుర్తి దవాఖానకు తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పోరెడ్డి లక్ష్మారెడ్డి, సభ్యులు కొమ్మిడి మల్లారెడ్డి, దొనికేనా సమ్మయ్యగౌడ్, సుగుణాకర్‌రెడ్డి, మోదుంపురం వెంకటేశ్వర్, ఇలియాస్, హన్మాండ్ల వెంకట్‌రెడ్డి, లతా జెట్టి, రాకేశ్‌రెడ్డి, టెక్నిషియన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మిత అయ్యవార్లను గ్రూప్‌-డీలో కొనసాగించాలి

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 13: ఇటీవల ప్రభుత్వ చేసిన కుల గణన సర్వే సందర్భంగా ఎస్సీ వర్గీకరణలో తమను గ్రూప్‌-సీలో కలపడం అన్యాయమని, తాము ఇది వరకు ఉన్న గ్రూప్‌-డీలోనే కొనసాగించాలని మిత అయ్యవార్ కుల సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నాగవెల్లి వెంకటస్వామి, గౌరవ అధ్యక్షుడు ధర్మపురి నర్సయ్య డిమాండ్ చేశారు. గురువారం వారు సీసీసీ నస్పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గ్రూప్‌-సీలోకి తమ కులాన్ని బదలాయించడంతో విద్య, ఉద్యోగావకాశాల్లో అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి మర్కాపురం రమేశ్, సహాయ కార్యదర్శి ధర్మపురి శ్రీనివాస్, మహిళా సాంస్కృతిక కార్యదర్శి తేలేటి స్వరూప, సలహాదారులు సత్వాడి వెంకటస్వామి, నాయకులు బట్టారి నారాయణ, పరాంకుశం, ప్రసాద్, మర్కాపురం శ్రీనివాస్, బట్టారి సాగర్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ పంటల నమోదు పరిశీలన

కాసిపేట, ఫిబ్రవరి 13 : కాసిపేట మండలంలోని మల్కేపల్లి, వరిపేట గ్రామాల్లో చేస్తున్న డిజిటల్ పంటల నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి చల్లా ప్రభాకర్ పరిశీలించారు. అనంతరం వరి పంటను పరిశీలించారు. వరి పంట ప్రస్తుతం పిలక దశలో ఉందని, ప్రస్తుతం అక్కడక్కడ కాండం తొలిచే పురుగు ఉంటుందని, దీని నివారణకు క్లోరాన్ట్రనిలిప్రోల్ 0.4 శాతం గుళికలు 4 కిలోలు ఒక ఎకరాకు చల్లాలని లేదా క్లోరాన్ట్రనిలిప్రోల్ 60 మిల్లీ లీటర్ లేదా ఐసోసైక్లోసెరమ్ 18 శాతం ఎస్సీ 120 మిల్లీ లీటని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. జింకు లోప నివారణకు వరి నాటిన 45 రోజుల లోపు చెలామిన్ జింక్ 400 గ్రాములు 200 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఈవో సంధ్య, రైతులు పాల్గొన్నారు.

మామిడి తోటల పరిశీలన

భీమారం, ఫిబ్రవరి 13: మండలంలోని ఖాజీపల్లిలో మామిడి తోటలను మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. మామిడిలో తేను మంచు పురుగు, అంత్రక్నోస్ ఆకు మచ్చ తెగుళ్లను గుర్తించినట్లు తెలిపారు. దీని నివారణకు లాండ సైహలోత్రిన్ 300 ఎమ్ఎల్, కార్బనిజం ప్లస్ మ్యాంకోజెబ్ 400 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' ను విజయవంతం చేయండి

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 13: ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురువారం స్థానిక ఐబీ ఆవరణలో పోస్టర్లు విడుదల చేశారు. 6 గ్యారెంటీలతోపాటు, 420 హామీలు, ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్ కుమార్ , జిల్లా నాయకులు రెడ్డి మల్ల ప్రకాశ్, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లన్న, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి అరుణ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సురేందర్, రాజేశం, సయ్యద్, అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షుడు కుశ్నేపల్లి కిష్టయ్య తదితరులున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హాజీపూర్, ఫిబ్రవరి 13 : మంచిర్యాల జిల్లా (ముఖ్య ప్రణాళిక) అర్థ గణాంక శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గాన్ని గురువారం టీఎన్జీవో కార్యాలయంలో ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా బీ రాజేందర్ రెడ్డి, కార్యదర్శిగా ఎస్ సతీశ్, కోశాధికారిగా అమరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పీ రమేశ్, సంయుక్త కార్యదర్శిగా ఎం కోమలత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పోచన్న, పబ్లిసిటీ సెక్రటరీగా శ్రీనివాస్, ఈసీ సభ్యులుగా వేణుగోపాల్, రమేశ్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వోలు ఏఊఆర్‌కే మూర్తి, గురువయ్య, మందమర్రి టీఎన్జీవో యూనిట్ సెక్రటరీ సీహెచ్ సతీశ్, ఎంపీఎస్వోలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు

కౌటాల, ఫిబ్రవరి 13 : రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు బీఆర్ఎస్ కార్యకర్తలంతా సిద్ధం కావాలని బీఆర్ఎస్ నియోజక వర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆరే సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే గెలుపు దిశగా కృషి చేయాలన్నారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన పథకాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. సిర్పూర్ టీ మండల బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేసారు. ఆయన వెంట కౌటాల, సిర్పూర్ టీ మండలాల అధ్యక్షులు నాగపురే బండు, అస్లం బిన్ అబ్దుల్లా, బీఆర్ఎస్ కార్యకర్తలు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

సేవాలాల్ మహరాజ్ జయంతికి సెలవు ప్రకటించాలి

లింగాపూర్, ఫిబ్రవరి 13: ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు సెలవు దినంగా ప్రకటించాలని బంజారా సేవా సంఘం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రాటోడ్ రవీందర్, సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ జాటోత్ రాహుల్ కోరారు. గతేడాది కేసీఆర్ ప్రభుత్వం ఈ జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం జయంతి రోజున సెలవు ప్రకటించడంతో పాటు అధికారికంగా ఉత్సవాలు నిర్వహించాలని కోరారు.

వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 13:జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగ రావుతో కలిసి మున్సిపల్ అధికారులతో పన్ను వసూలు పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని, పెండింగ్ లో ఉన్న పన్నులను వెంటనే వసూలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేయాలని తెలిపారు. ఈ క్రమంలో పన్ను వసూలుకు సంబంధించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- మంచిర్యాల డీసీపీ భాస్కర్

చెక్‌పోస్టును పరిశీలిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

కోటపల్లి, ఫిబ్రవరి 13 : ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. కోటపల్లి మండలంలోని రాపనపల్లి గ్రామం సమీపంలోని ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును డీసీపీ పరిశీలించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సరిహద్దులపై ప్రత్యేక నిఘాను ఉంచాలన్నారు. అనంతరం ఎర్రాయిపేట గ్రామం సమీపంలోని ఇసుక నిల్వలను పరిశీలించారు. ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూర్ రూరల్ సీఐ సుదాకర్, తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎస్ఐ రాజేందర్ తదితరులు న్నారు.

తల్లి కడుపులోనే శిశువు మృతి

- ఎంసీహెచ్‌లో వెలుగు చూసిన ఘటన

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆరోగ్య సంరక్షణ దవాఖానలో (ఎంసీహెచ్) తల్లి కడుపులోనే నవజాత శిశువు మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన గవిడి సుమలత ప్రసూతి కోసం బుధవారం ఎంసీహెచ్‌కు వచ్చింది. వారు వచ్చిన సమయానికి ఓపీ సమయం ముగియడంతో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. మరుసటి రోజు గురువారం దవాఖానకు రావడంతో సుమలతను పరీక్షించిన వైద్యులు కడుపులో ఉన్న శిశువు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో సుమలత బంధువులు వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందిందని వైద్యులతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. ఈ ఘటన పై దవాఖాన ఆర్ఎంవో శ్రీధర్‌ను వివరణ కోరగా వారు ఎంసీహెచ్‌కు 102 అంబులెన్స్‌లో కాకుండా ఆటోలో వచ్చారని వారు వచ్చిన సమయానికి ఓపీ సమయం ముగియడంతో అక్కడే ఉన్న నర్సులు లేబర్ రూం వెళ్లి అడ్మిట్ కావాలని సూచించారని, కాని వారు ఆటో తిరిగి వెళ్లిపోయినట్లు దవాఖాన సీసీ ఫుటేజ్ పరిశీలనలో తేలిందన్నారు. దీనిపై పూర్తి విచారణ జరగాల్సి ఉందన్నారు. ప్రస్తుతం సుమలతకు ఎంసీహెచ్‌లోనే వైద్య చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

బార్‌లో దాడి కేసులో మరో ముగ్గురి రిమాండ్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13 : పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో ఓ బార్‌లో జరిగిన గొడవలో దాడికి పాల్పడిన మరో ముగ్గురిని రిమాండ్ తరలించినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమవేశంలో కేసు వివరాలను టూటౌన్ ఎస్ఐ మహేందర్‌తో కలిసి సీఐ వెల్లడించారు. తాండూర్ మండలానికి చెందిన బండారి వంశీ బార్‌లో మద్యం సేవించిన అనంతరం ఫుడ్ ఆర్డర్ ఇవ్వగా ఆలస్యం కావడంతో ప్లేట్‌ను ఎత్తివేశాడు. తమను చూసే ప్లేట్‌ను ఎత్తివేశాడని పక్క టేబుల్ వద్ద మద్యం సేవిస్తున్న పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అల్లి సాగర్, అతని స్నేహితులు ఒక్కసారిగా వంశీపై బీరు సీసాలతో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. దీంతో వంశీకి తలకు, కను బొమ్మలు, కుడి చెంప, పొట్ట భాగంలో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వంశీని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వంశీ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాంధీనగర్‌కు చెందిన అల్లీ సాగర్‌తో పాటు బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లికి చెందిన రత్నం సోమయ్య, అంబేద్కర్‌నగర్‌కు చెందిన మామిడి అన్నమయ్యను ఈ నెల 9న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న కన్నాలబస్తీకి చెందిన కోట సాశీల్, శాంతిఖని బస్తీకి చెందిన కాలం నవీన్, రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన చింతం సాయికుమార్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ వెల్లడించారు.

క్రాప్ బుకింగ్ సర్వే

కన్నెపల్లి, ఫిబ్రవరి 13 : భీమిని మండలంలో వడాల గ్రామంలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేను గురువారం ఏడీఏ సురేఖ పరిశీలించారు. యాసంగి పంట వివరాలు ఆన్‌లైన్‌లో రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన


ఖిల్లాలో నీటి ఊట చెలిమెను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 13: మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి 9వ వార్డు(బొక్కలగుట్ట పంచాయతీ శివారులో)లోని అటవీ ప్రాంతంలోని గాంధారి ఖిల్లాలో నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే మైసమ్మ జాతర ఏర్పాట్లను గురువారం సాయంత్రం మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఈ జాతరకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గిరిజన శాఖ, రెవెన్యూశాఖ, మున్సిపల్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో సేవలందించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మందమర్రి తహసీల్దార్ సతీశ్, క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్ గద్దె రాజు, రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ జీ రాజశేఖర్, రెవెన్యూ ఆర్ఐలు రాథోడ్ గణపతి, బొలిశెట్టి పద్మజ, వివిధ శాఖల అధికారులు, నాయక్‌పోడ్ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు 'ఉపాధి' కల్పించాలి

- డీఆర్డీవో కిషన్

తాండూర్, ఫిబ్రవరి 13 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించే విషయంలో కానీ వేతనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీఆర్డీవో కిషన్ అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విధుల్లో ఏమాత్రం అలసత్వం, నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2.70 కోట్లతో మండల వ్యాప్తంగా నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ బృందం ప్రజా వేదికలో నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా కిష్టంపేట, కొత్తపల్లి, అచ్చలాపూర్, నీలాయిపల్లె, రేచిని, మాదారం, మాదారం శ్రీ ఇంక్లైన్, ద్వారకాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో రూ.7084 నిధులు దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ కాగా రూ.6000 జరిమానా విధించి మొత్తం రూ.13084 రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కిరణ్, అంబుడ్స్‌మెన్ శివరాం, ఎంపీడీవో పీ శ్రీనివాస్, ఏపీవో నందకుమార్, ఈజీఎస్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం పరిశీలన


పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కోటపల్లి, ఫిబ్రవరి 13 : కోటపల్లి మండలంలోని బోరంపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు. కొల్లూరు, బోరంపల్లి గ్రామాల్లోని రైతులకు సాగునీటిని అందించే ఎత్తిపోతల పథకం పై ప్రభుత్వం చిన్నచూపు కారణంగా కోట్ల విలువైన సామగ్రి, ఇతర వస్తువులు దొంగల పాలైనట్లు సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ఆర్‌సీపీ నాయకులు జయరావ్, నాయకులు రాతిపల్లి నగేశ్, కుందారపు చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదవాలి

- మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్


మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్

జన్నారం, ఫిబ్రవరి 13 : విద్యార్థులు కష్టపడి చదవాలని మాజీ జడ్పీటీసీ, రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రాఘవేంద్ర సినిమా హాల్‌లో కరిమల కళాశాల, లిటిల్ హన్స్ హైస్కూల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం మోటివేషన్ స్పీకర్ రాజేందర్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర సంపత్, ఎర్ర నరేశ్, శీలం రమేశ్, ముత్యం సతీశ్, సిటిమల భరత్‌కుమార్, మున్వర్‌అలీఖాన్, రాజు నోముల ప్రిన్సిపాల్ లక్ష్మణాచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

మందమర్రి రూరల్, ఫిబ్రవరి13: మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు నందిపాట రాజ్ కుమార్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో గురువారం ఎంఈవో శ్రీనివాస్‌ను కలిసి కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమగ్ర మూల్యాంకనాన్ని చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల పనితీరును, మధ్యాహ్న భోజనం పథకాన్ని మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలపై దృష్టి సారించాలని కోరారు.

జేఈఈ ఫలితాల్లో సీవోఈ విద్యార్థుల ప్రతిభ


జేఈఈ ఫలితాల్లో సీట్లు సాధించిన విద్యార్థులు
జేఈఈ ఫలితాల్లో సీట్లు సాధించిన విద్యార్థులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 13 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంట్రల్ ఆఫ్ ఎక్సెన్సీ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపారు. మొత్తం 39 విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దుట శ్రీధర్ తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులు షేక్ సుభాన్(88.88), కే. శ్రీనివాస్ (80.17), ఎం సాయిరాం (78.99), కే. షారోన్.(76.84),డి. రాజేందర్ (75.69),ఎస్. ఆదర్శ్, (75.04),ఎస్. అభిలాష్,(74.46), సీహెచ్. సాయికుమార్ (74.43), ఎస్ వెంకటేశ్వర్ (72.66),బీ .అంజిబాబు (72.3), జి.చరణ్ ((63.87), ఐ. శ్రీహర్ష ప్రణయ్ కుమార్.(63.58) ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ విజయ్ సాగర్, ఉపాధ్యాయులు ఎన్ఎస్ వర్మ. ఎం.రమేశ్, ఏ.రాజేశ్, లక్ష్మీనారాయణ, ఎం.శోభ, ఏ.రవి, కే.రవీందర్, జీ చంద్రశేఖర్, ఏ.వామన్ పాల్గొన్నారు.

అధికారుల అండదండలతోనే బియ్యం అక్రమ రవాణా : సీపీఎం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 13: కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో అధికారుల అండదండలతోనే బియ్యం అక్రమ దందా జోరుగా కొనసాగుతుందని సీపీఎం ఏరియా కమిటీ కన్వీనర్ ముంజం ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జిల్లాలో రెవెన్యూ, పోలీసు, సివిల్ సప్లై అధికారుల అండదండలతోనే పీడీఎస్ బియ్యం అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారని విమర్శించారు. రెండు రోజుల క్రితం సిర్పూర్(టీ)మండలంలో 200 క్వింటాళ్లకు పైగా బియ్యం పోలీసులు పట్టుకున్నారని తెలిపారు.

పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో గమాన్యుయల్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో గమాన్యుయల్ అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నజ్రుల్ నగర్ నెంబర్ 5 పాఠశాలలను డీఈవో గమాన్యుయల్ తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని జడ్పీఎస్ఎస్ పెట్రోల్ పంపు పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న భవిత పాఠశాలను సందర్శించారు.

భూమి, నీటి సంరక్షణపై శిక్షణ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 13: కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి రైతు వేదికలో గురువారం భూమి యాజమాన్యం శిక్షణ, పరిశోధన సంస్థ వలంటరీ హిమాయత్ సాగర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులకు భూమి, నీటి సంరక్షణ యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేల, నీటి వినియోగం భూ సంరక్షణ పద్ధతులు సేంద్రియ వ్యవసాయం ఆయిల్ ఫామ్ తోటల సంరక్షణ ప్రాంతాల్లో నేల, నీటి సంరక్షణ పద్ధతులు డ్రిప్ ఇరిగేషన్ వర్షపు నీటిని నిల్వ చేసే పద్ధతులు నీటి కుంటలు మల్చింగ్ విధానంతో కలిగే ప్రయోజనాలు ఇంకుడు గుంతలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, సహాయ వ్యవసాయ అధికారి కే సునీత, వ్యవసాయ అధికారి ఎస్ అన్నపూర్ణ, సిర్పూర్ కాగజ్‌నగర్ సహాయ వ్యవసాయ సంచాలకుడు మనోహర్, కాగజ్‌నగర్ ఏవో రామకృష్ణ పాల్గొన్నారు

కుర్తా ఆలయం వరకు రోడ్డు సౌకర్యం

కౌటాల, ఫిబ్రవరి 13 : మండలంలోని తాటిపల్లిశివారులోని వార్ధా నది కుర్తా వద్ద గల శ్రీ శివ సిద్ధి హనుమాన్ ఆలయం శివరాత్రి ఉత్సవాల దృష్ట్యా గురువారం ఆలయం వరకు మొరం రోడ్డు పనులను ఎమ్మెల్సీ దండే విఠల్ సహకారంతో ప్రారంభించినట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బొమ్మకంటి మహేశ్, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. వారి వెంట జడ్పీ మాజీ చైర్మన్ సిడం గణపతి, ఆలయ కమిటీ సభ్యులున్నారు..

మాలీ కులస్తులకు ఎస్టీ హోదా కల్పించాలి

బెజ్జూర్, ఫిబ్రవరి 13 : మాలి కులస్తులకు ఎస్టీ హోదా కల్పించాలని మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెండుగురి శ్యాంరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడుడిగా ఎన్నికైన సందర్భంగా మండల కేంద్రానికి వచ్చిన వచ్చి మాలి కులస్తులతో మాట్లాడారు. గురువారం మండల కేంద్రంలో మాలి సంఘం భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాలి కులస్తుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. వెనుకబడిన మాలి కులస్తులకు ఎస్టీ హోదా కల్పించి రిజర్వేషన్‌తోనైనా ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్, మాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాందేవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు బాబురావు, సందయ్య, మోహన్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, ఫిబ్రవరి 13 : సైబర్ నేరాల విషయంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాంకిడి యం.ప్రశాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆవరణలో (పీ.వీ.ఆర్) కాంస్ట్రక్షన్స్ సివిల్ ఇంజినీర్ దుర్గం ప్రశాంత్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాంకిడి ఎస్ఐ ఎం ప్రశాంత్, టీజీబీ బ్యాంక్ మేనేజర్ జాడి. కృష్ణ, జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డొంగ్రి ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని, వాటిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం రాకేశ్, రితేశ్, ఆకాశ్, యుగంత్, వినియోగదారులు, తదితరులున్నారు.

విద్యార్థులను చితకబాదిన టీచర్!

విద్యార్థి చేతికి గాయం

కౌటాల, ఫిబ్రవరి 13 : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు తాగి పాఠశాలకు వచ్చాడు. రావడమే కాకుండా పిల్లలను చితకబాదాడు. ఇంటికి చేరిన అనంతరం తల్లిదండ్రులకు తెలుపడంతో ఈ విషయం బయటికి వచ్చింది. విద్యార్థులు, తల్లిదండ్రుల కథనం ప్రకారం.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని గుండాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతి రోజూ పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం తర్వాత స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు. గురువారం స్టడీ అవర్‌కు సోషల్ టీచర్ శ్రీనివాస్ హాజరయ్యాడు. అయితే ఆ ఉపాధ్యాయుడు మద్యం తాగి పాఠశాలకు వచ్చాడు. రావడమే కాదు, పిల్లలు చదవడం లేదని కోపంగా కర్రతో ఇష్టం వచ్చినట్టు కొట్టాడు. స్టడీ అవర్ తర్వాత రాత్రి 9గంటల ప్రాంతంలో ఇండ్లకు చేరుకున్న పిల్లలు ఈ విషయాన్ని ఇంట్లో చెప్పడంతో తల్లిదండ్రులు ఆగ్రహించారు. వెంటనే పాఠశాలకు చేరుకున్నారు. సదరు ఉపాధ్యాయుడు వెళ్లిపోగా, కాసేపు ఆందోళన చేశారు. విద్యార్థులపై విచక్షణ రహితంగా కర్రతో కొట్టిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యం మద్యం తాగి వస్తున్నాడని, ఎవరికైనా చెబితే కొడతానని బెదిరిస్తున్నాడని విద్యార్థులు రోదిస్తూ తెలిపారు. ఈ విషయమై ఎంఈవో జీ హన్మంతును సంప్రదించగా, విద్యార్థుల తల్లిదండ్రులు తనకు ఫోన్ చేసి చెప్పారని, అప్పటికే హెచ్ఎం నానాజీతో మాట్లాడనని తెలిపారు. శుక్రవారం పాఠశాలకు వెళ్లి, విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతానని, విద్యార్థులపై చేయి చేసుకున్న ఉపాధ్యాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ముగిసిన గంగాపూర్ జాతర

రెబ్బెన, ఫిబ్రవరి 13 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామ శివారులో మూడు రోజుల పాటు జరిగిన బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర గురువారం ముగిసింది. చివరి రోజు కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో రెబ్బెన సీఐ బుద్దే స్వామి, ఎస్ఐలు చంద్రశేఖర్, శ్రీకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బాపురెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు వసతులు కల్పించారు.